మదర్ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు

విశాలాంధ్ర-తెనాలి : పాత గవర్నమెంటు హాస్పటల్ ఆవరణలో మదర్‌ఫీడింగ్ సెంటర్‌ను తెనాలి టౌన్ ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మదర్ ఫీడింగ్ సెంటర్ అవసరాన్ని గుర్తించి ఏర్పాటు చేశారన్నారు. నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ, పేద మహిళలకు చీరలు పంపిణీ, వృద్ధులకు చేయూత పెన్షన్‌ను అందించారు. కార్యక్రమంలో గోనుగుంట్ల జయంత్, జుజ్జూరి శ్రీనివాస్, రీజియన్ ఛైర్మన్ భాస్కరుణి బ్రహ్మ ప్రసాద్, ఆర్.ఎస్. శారద, జోన్ ఛైర్మన్ సంకా లక్ష్మి నరసింహమూర్తి, క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడేసిన చెట్లు

విశాలాంధ్ర-చేబ్రోలు: రోడ్డుపై చెట్టు పడవేయ టంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. చేబ్రోలు పట్ట ణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురు రోడ్డులో వర్షం కారణంగా విద్యుత్ తీగలకు చెట్లు తగులుతున్నాయనే కారణంతో చెట్లను నరికి రోడ్డుకు అడ్డంగా పడవేశారు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజలకు, ఆమార్గంలో తిరిగే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలుపుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, కానీ, పంచాయతీ అధికారులు కానీ వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు. చెట్లను రోడ్డుకు అడ్డంగా పడవేయటంతో చెట్లు పక్కనే ఉన్న సైడ్ మురుగు కాలువలో పడి మురుగు నీరు పారుదల కూడా నిలిచిపోయాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందన సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-చేబ్రోలు: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోపాల్ కృష్ణ తెలిపారు. కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 2 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించుటకు ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వ్యక్తులు వివిధ అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో 'ముదుఘంటికలు' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలో తెలంగాణ జనసత్తా వ్యవస్థా పక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి రచించిన 'ముదుఘంటికలు' పుస్తకా విష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పుస్తకావి ష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ 'ముదుఘంటికలు' పుస్తకం సామాజిక చైతన్యానికి, సామాజిక వికాసానికి చైతన్య కరదీపికగా నిలుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ మంచికి మారుపేరుగా మసులుకోవాలని, ప్రతి పౌరుడు చైతన్యవంతుడై ప్రశ్నించేతత్వం, జవాబుదారీతనం పెంచుకుని దేశ సౌభాగ్య సాధానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పుస్తక రచయిత, తెలంగాణ జనసత్తా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిని, అక్రమాలను ఎదురించడమే నా లక్ష్యంగా సమాజానికి మేలుకొలుపుగా మార్గదర్శిగా నిలవాలన్న ఆశయంతో, ఆలోచనతో నవసమాజానికి ఈ పుస్తకాన్ని అందించానని అభిప్రాయపడ్డారు. అనంతరం పుస్తక రచయిత డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డిని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఘనంగా సన్మానించారు.

మణిపూర్ దోషులను శిక్షించాలి

విశాలాంధ్ర-పొన్నూరు: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంస కాండలు ప్రోత్సహించి దాడి చేస్తున్న వారిని రాజ్యాంగబద్ధంగా శిక్షించాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు అన్నారు. సోమవారం పొన్నూరు అంబేద్కర్ సెంటర్లో మణిపూర్ దహన కాండకు నిరసనగా ఆయన ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు గుంటూరు ఏడుకొండలు అధ్యక్షత వహించగా ఆరేటి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఆడపిల్లలను నగ్నంగా ఊరేగించి వారిపై అత్యాచారం జరపడం సిగ్గుచేటు అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని యావత్ భారతదేశం తలదించుకునేలా చేశారన్నారు. 80 రోజులుగా మణిపూర్ రాష్ట్రం రావణకాష్టంగా కాలుతుంటే ప్రధాని నోరు విప్పి మాట్లాడకపోవడం సిగ్గుచేటని సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంతవరకు కేంద్రం స్పందించకపోవడం బిజెపికి ఓటు వేసిన ప్రతి ఒక్కరిని కించపరిచినట్టే అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని రాష్ట్రపతి పాలన విధించాలని బిజెపి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలన్నారు. ప్లంబర్స్ యూనియన్ అధ్యక్షులు కంచర్ల సుధీర్, బ్రహ్మం, సుబ్బారావు, అచ్చయ్య, సాయి, సుధీర్, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-పొన్నూరు: పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు కన్ను పోయిన ప్లంబర్ కార్మి కుడు మీసుగ శ్రీకాంత్‌కు సోమ వారం పొన్నూరు ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్లంబర్, ఎలక్ట్రికల్, బోరువర్కర్స్ యూనియన్ నాయకులు 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజానాట్యమండలి నాయకుడు ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. యూనియన్ నాయకులు కంచర్ల సుధీర్, కార్య దర్శి గుమ్మడి సుబ్బారావు, గుర్రపుశాల అచ్చయ్య, గుర్రం నాగేశ్వర రావు, తిరువరపు సుబ్బారావు, కొండేటి బ్రహ్మం, సుభాని, పటాన్ అబ్దుల్, ఎల్లయ, నాగ పెద్దిబాబు, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ...దొంగ ఓట్లు గుర్తించండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రానున్న ఎన్ని కల్లో తూర్పు నియోజక వర్గాన్ని ఘన విజయంతో గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పిలుపు నిచ్చారు. నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో బీఎల్‌ఓల కమిటీ సమావేశంలో ముస్తఫా మాట్లాడారు. 2024, జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరిని ఓటర్ల జాబితాలో చేర్చాలని అన్నారు. వార్డుల్లో నకిలీ ఓట్లు, దొంగ ఓట్లను గుర్తించి వెంటనే బీఎల్ ఓలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తూర్పు నియోజకవర్గ వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు, క్లస్టర్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.10వేలు సాగు సాయం అందించాలి..

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తెలంగాణ ప్రభుత్వం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేలు సాగు సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏఐకేఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగా రెడ్డి, పచ్చల శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్ రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలోని ప్రతి రైతు రూ.2.45లక్షలు రుణభారంతో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉన్నాయని, కనీస మద్దతు ధరలకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.10 వేల సాగు సాయం అందించాలని, రెండు ఎకరాల వరకు సాగు చేస్తున్న ప్రతి రైతుకు రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు అమలు చేయాలని, రైతు, కౌలు రైతుల అన్ని రకాల పంట రుణాలను రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకుని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉపకరణాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన రైతు, కౌలు రైతులకు ప్రతి నెల రూ.10 వేల ఫించన్ అందించాలని, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించాలనే ఆలోచనను ఉపసంహరించుకుని ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వ్యవసాయ పథకాలన్నీ వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఆత్మహత్యలలో రాష్ట్రం 3వ స్థానంలో ఉందని, వీరిలో అత్యధికులు పేద రైతులు, కౌలు రైతులేనన్నారు. ఇప్పటికైనా రైతు సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఆర్వోని కలిసిన వారిలో రైతు సంఘం నాయకులు కంజుల విఠల్ రెడ్డి, ముప్పాళ్ళ శివశంకరరావు, మేడా హనుమంతరావు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ విశేష కృషి

విశాలాంధ్ర-గుంటూరు : ఎస్టీయూ ద్వారా గత సంవత్సర కాలంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, ప్రధాన కార్యదర్శి చందా నరసింహారా వులు విశేష కృషి చేశారని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న అన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్న గేరా మోహనరావు పదోన్నతిపై పల్నాడు జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న చందా నరసింహారావు పదోన్న తిపై బాపట్ల జిల్లా బదిలీ అయిన సందర్భంగా వారిరువు రికి ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎస్టీయూ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలదండలు, జ్ఞాపికలతో సన్మానించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహనరావు, నరసింహా రావు మాట్లాడుతూ గత సంవత్సరం జూలై 3 నుంచి ఇప్పటివరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేయడం జరిగిందని, అదేవిధంగా సమస్యల పరిష్కారానికి జిల్లాలోని ఆర్జేడీ, డీఈవో, జడ్పీ సీఈవో, ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారన్నారు. ఈ సమయంలో తమకు పూర్తి సహాయసహకారాలు అందించిన ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబుకు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులకు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర నాయకులు ఎస్.రామచంద్రయ్య, ఎస్ఎం సుభాని, ఈ.అంబరీష్యుడు, కాకుమాను జోజప్ప, జిల్లా నాయకులు డి.పెదబాబు, యూ.చంద్రజిత్ యాద వ్, జె.శ్రీనివాస్, కె.బెనహర్ బాబు, డీవీ సుబ్బారావు, మద్దిరాల వెంకటేశ్వర్లు, పేరేచర్ల శ్రీనివాసరావు, జి.జోజ ప్ప, షేక్ బాజీ, మహమ్మద్ నజీర్, బి.హనుమంతు ప్రసాద్, ఎల్.వీరాంజనేయులు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సిహెచ్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

బహుళ అంతస్తు నివాసుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక విద్యానగర్ ఎక్స్ టెన్షన్ సీతయ్య డొంకలో ఉన్న ఓక బహుళ అంతస్తుల భవన నివాసులు సోమ వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, నగరపా లక సంస్థ కార్యాలయంలో జరిగిన స్పందనలో అధికారులకు వినతిపత్రం ద్వారా సమస్యలను విన్నవించుకున్నారు. బహుళ అంతస్థకు సంబంధించిన బిల్డర్ ప్రభుత్వం నుండి ఆక్యుఫెన్సీ సర్టిఫికెట్ తీసుకోలేదనీ, మున్సిపల్ కొళాయి కూడా ఏర్పాటు చేయలేదనీ, స్టేట్ ఫైర్ డిపార్ట్మెంట్ నుండి అసలు ఎన్ఓసి లేదనీ, సోలార్ పవర్ సిస్టమును ఏర్పాటు చేయలేదనీ, పన్ను చెల్లింపు విషయంలో గుంటూరు నగరపాలక సంస్థను పక్కదారి పట్టించారంటూ ఫిర్యాదు చేశారు. లిఫ్టులు విషయంలో కూడా అన్యాయం జరిగిందనీ, సెల్లార్‌లో అప్పుడే భీముల నుండి రెగ్యులర్‌గా వాటర్ లీకేజ్ అవుతుందనీ చెప్పిన అగ్రిమెంటుకు విరుద్ధంగా భవన యాజమాన్యం అనేక అవకతవకలకు పాల్పడిందని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రెంటాల కోటేశ్వరరావు, కాకాని శంకర్రావు, సుభాష్ చంద్రబోస్, జగన్మోహన్ రావు, కిరణ్ కుమార్, జాన్ డేనియల్, రవికుమార్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పెదబాబు, సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు : ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులుగా గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(పీఎస్)గా చేస్తున్న డి.పెదబాబును, ప్రధాన కార్యదర్శిగా పెదకాకాని మండలం అగత వరప్పాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న దీకే సుబ్బారెడ్డిలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు తెలియజేశారు. గుంటూరులో నిర్వహించిన ఎస్టీయూ ప్రథమ కార్యవర్గ సమావేశంలో వీరిని ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పనిచేస్తున్న గేరా మోహనరావు, చందా నరసింహారావులు పదోన్నతులపై పల్నాడు, బాపట్ల జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా ఈ నూతన ఎంపిక జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదబాబు, సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని, అదేవిధంగా ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీరిని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, గుంటూరు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, అంబరీష్యుడు, సుభాని, జోజప్ప, జె.శ్రీనివాస్, కె.బెనర్ బాబు తదితరులు అభినందించారు.

ఆర్-5 జోన్‌లో ఇళ్ల పేరుతో పేదలకు మోసం

విశాలాంధ్ర-మంగళగిరి: ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం పేరుతో పేదలను సీఎం జగన్ మోసం చేస్తున్నారని అమరావతి ప్రాంత రైతులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాజధాని పరిధిలోని గ్రామాల్లో రైతులు ఆందోళనకు దిగారు. కృష్ణాయపాలెం, శిబిరాల వద్ద నల్ల జెండాలు, బెలూన్లతో నిరసన చేపట్టారు. ఆర్-5 జోన్ అంశంపై హైకోర్టులో తీర్పు రిజర్వులో ఉన్నప్పటికీ ఇళ్ల నిర్మాణంపై ముందుకెళ్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టులంటే జగన్‌కు పట్టింపు లేదని మండిపడ్డారు. అమరావతి రైతులను కావాలనే ఇబ్బందిపెడుతున్నారు. కోర్టులంటే సీఎం జగన్‌కు పట్టింపు లేదు. రాజధాని రైతులను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. అమరావతి రైతుల సమాధుల పైనుంచి ఎన్నికులకు వెళ్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రతిభా పురస్కారాలు అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి: విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 107 సంవత్సరాలు పూర్తి చేసుకుని 108వ సంవత్సరంలోకి అడుగుపెట్టి సభ్యులకు తక్కువ వడ్డీ పై వివిధ రుణ పథకాలు సభ్యులకు అందచేస్తుంది. అలాగే సభ్యుల పిల్లలకు 10వ తరగతి ఇంటర్మీడియట్‌లో 90 శాతం పైగా మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేస్తుందని బ్యాంకు డైరెక్టర్ పి.వి రమణారావు అన్నారు. మంగళగిరిలోని హెచ్.పీ గ్యాస్ గొడను వెనుక గల విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ ఆవరణలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు డైరెక్టర్ పి.వి రమణ రావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ1500 కోఆపరేటివ్ బ్యాంకులలో అతిపెద్ద అతిపెద్ద కోపరేటివ్ బ్యాంకుగా డి విశాఖపట్టణం కోపరేటివ్ బ్యాంక్ అవతరించిందని, సభ్యులకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. మంగళగిరి బ్రాంచ్ లోని ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు 27,500 రూపాయల నగదు పురస్కారంతోపాటు, మెరిట్ సర్టిఫికెట్లను చిరు కానుకలను బ్యాంక్ డైరెక్టర్ పివి రమణ రావు, చిన్నం కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ సిహెచ్ విఆర్ సుబ్రహ్మణ్యం అందజేశారు. ఈ సమావేశంలో సంప్రదింపుల కమిటీ మెంబర్లు బ్యాంక్ మేనేజర్ కే వి బి ఫణి ప్రసాద్, ఏ వెంకట స్వామి, బత్తూరి మోహనరావు, జై రవిబాబు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మధుసూధనరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని రీజనల్ కో-ఆర్డినేటర్స్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని రాష్ట్ర కృష్ణ బలిజ పూసల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోలా భవని ఆధ్వర్యంలో ఏపీ చేత్తాద శ్రీ వైష్ణవ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వరయూరి మధుసూధనరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుసూధనరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలనపై హర్షం వ్యక్తంచేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ విజయం వెనుక అయోధ్య రామిరెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్, పెరియాళ్‌ల వంటి మహనీయుల ఆశయాలే సీఎం జగన్ అజెండాగా పని చేస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో కూడా జగనన్న ప్రభుత్వం ఏర్పడే విధంగా అయోధ్య రామిరెడ్డి నాయకత్వంలో పని చేస్తామన్నారు. కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోలా అశోక్‌కుమార్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం వెంకటేష్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 128 అర్జీలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక కలక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్ర శేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 128 అర్జీలను స్వీకరించారు.

సినీనటి కళ్యాణికి ఘన నివాళి

విశాలాంధ్ర-తెనాలి : కళ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాటక, సినీనటి "కళ్యాణి" (తెనాలి) కళాహృదయుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపో యారని వక్తలు నివాళులర్పించారు. తెనాలి గాంధీనగ ర్‌లో సోమవారం బొల్లిముంత ఫౌండేషన్ హాలులో అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమం డలి, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళ్యాణి వర్ధంతి సభ జరిగింది. సభకు సిహెచ్. శ్రీదేవి అధ్యక్షత వహించారు. కళ్యాణితో అనుబంధవున్న సినీ, నాటక నటి వాల్మీకి విజయలక్ష్మి మాట్లాడుతూ కళ్యాణి నటనే జీవనంలా అటు చలనచిత్ర రంగంలో, రంగస్థలిపై తనదైన శైలిలో ప్రేక్షకుల నీరాజనాలందుకున్నారని చెప్పారు. ప్రముఖ సినీరచయిత సముద్రాల రాఘవాచార్య ఆమె హావభావాలు అకట్టుకోవడంతో ఆయన బి.ఎన్.రెడ్డికి పరిచయం చేయగా తన వందేమాతరం సినిమాలో కాంచనమాలతో రెండో హీరోయిన్‌గా నటింపజేశారని తెలిపారు. మంచి గుర్తింపు వచ్చి నాటినుండి మారుతీ మాధవీయం, మాయా మశ్చీంద్ర, పాదుకాపట్టాభిషేకం, చూడామణి, ద్రౌపదీ మాన సంరక్షణ సినిమాలో నటించి సినీవినీలాకాశంలో మేటి నటిగా ప్రశంసలందుకున్నారు. అధ్యక్షత వహించిన శ్రీదేవి మాట్లాడుతూ ఆమె తెనాలిలో వున్న సమయంలో నేతి పరమేశ్వరశర్మ పరిచయంతో సినీరంగ విరమణ అనంతరం నాటకరంగంలో బొబ్బిలి యుద్ధం, సత్యహరిశ్చంద్ర, తులాభారం, ఖిల్జీరాజపతనం తదితర నాటకాలు ప్రదర్శించారన్నారు. రాష్ట్ర, రాష్ట్రేతరంగా బొంబాయి, మద్రాసు నగరాల్లో నాటకాలు ప్రదర్శించి ప్రశంసలందుకున్నారని చెప్పారు. తోటి కళాకారులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. క్రమశిక్షణ, ఆత్మస్థైర్యంతో కళాకారులు ముందుకు సాగాలని నాటక సినీరంగ ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేయాలని ఆమె మాటలను నేటితరం కళాకారులు స్వీకరించి కళారంగ సేవలందిస్తారని ఆశిద్దాం అన్నారు. సభా ప్రారంభంలో ఆమె చిత్రపటానికి కళాకారులు పూల మాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వెంకట్, యం.వి.రఘునాధరావు, జగన్మోహనరావు, నాగేశ్వర రావు, విజయదుర్గ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తాత్విక ప్రయాణికుడు జాషువా

విశాలాంధ్ర-తెనాలి : జాషువా ఆధునిక కవిత్వానికి జవజీవాలు అందించిన తాత్విక ప్రయాణీకుడు గుర్రం జాషువా. పాఠకుల హృద యాలలో నిలిచిపోయారని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియే షన్ తెనాలి ఆధ్వర్యంలో సోమవారం జాషువా 52వ వర్ధంతి సభ జరిగింది. సభకు అసోసియేషన్ అధ్యక్షులు మాచి రాజు రామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి తెనాలి అధ్యక్షులు బి.న్యూటన్ మాట్లాడుతూ జాషువా జీవించిన డెబ్బై ఆరేళ్ళలో 50 ఏళ్ళు రచన జీవితంలోనే గడిపారన్నారు. ఆయన రచన జీవితం గొప్ప ప్రయాణం అన్నారు. సంఘ సంస్కరణ స్వాతంత్రోద్యమ కాలంలో పుట్టుకొ చ్చిన జాషువా శివాజీ కావ్యంతో ప్రారంభించిన పిరదౌసి, ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర, స్వప్న కథ, అనాథ తదితర రెండు వందలకుపైగా కవిత్వ ఖండికలు రాశారన్నారు. ఉపాధ్యాయునిగా, రాజకీయవేత్తగా వెలుగొందారని వివరించారు. అధ్యక్షత వహించిన రామకృష్ణ మూర్తి జాషువా జీవిత విశేషాలను వివరించారు. ఉపాధ్యాయ నాయకులు కనపర్తి బెన్‌హర్ మాట, పాట ద్వారా జాషువా కవితా ప్రతిభను వివరించారు. గబ్బిలం రచనలో తాత్వికవాదం కనిపిస్తుందన్నారు. దేవుని సృష్టిగా ప్రచారాన్ని వ్యవస్థను జాషువా విమర్శించారని చెప్పారు. సంస్థ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు స్వాగతం పలుకుతూ జాషువా పద్యాల విశిష్టతను తెలిపారు. బెల్లంకొండ హృదయరాజు పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా సాగింది. సభా ప్రారంభానికి ముందు తెనాలి బస్టాండు దగ్గర ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లర్పించారు. మాతంగి సత్యపాల్, సోమయ్యశాస్త్రి, నారాయణ తదితరులు పాల్గొన్నారు. గాయకుడు గంటయ్య బెన్‌హర్, వై.చింపయ్య జాషువా పద్యాలను, పాటలను గానం చేశారు.

విద్యార్థులకు 'విశాఖ బ్యాంక్' ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర-గుంటూరు : బ్యాంకు సభ్యులను కుటుంబసభ్యులుగా భావించి, వారి పిల్లల్లోని ప్రతిభకు తగిన పుం స్కారం అందించాలన్న ఉద్దేశంతో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఏటా ప్రతిభా పురస్కారాలను అందజేస్తోందని బ్యాంకు డైరెక్టర్‌లు పీవీ రమణరావు, చిన్నం కోటేశ్వరరావు అన్నారు. గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో గల బ్యాంకు గుంటూరు-1 టౌన్ బ్రాంచ్ ఆవరణలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా పీవీ రమణరావు, చిన్నం కోటేశ్వరరావులు మాట్లాడుతూ అంకితభావం, దూరదృష్టి కలిగిన పాలకవర్గం ఆధ్వర్యంలో 94 వేల మంది సభ్యులతో నేడు బ్యాంకు రూ.7026 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందన్నారు. కేవలం బ్యాంకింగ్ సేవలకే పరిమితం కాకుండా బ్యాంకు సభ్యుల సంక్షేమానికి బ్యాంకు అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. గత సంవత్సరం అర్జించిన రూ.73 కోట్ల లాభం లో 12 శాతం బ్యాంకు సభ్యులకు పంపిణీ చేయడం జరిగిందని వెల్లడించారు. అంతే కాకుండా బ్యాంకు సభ్యుల పిల్లలు దాదాపు 4 వేల మందికి సుమారు రూ.2 కోట్ల విలు వైన ప్రతిభా పురస్కారాలను అందజేయడం జరిగిందని, ఈ సంవత్సరం రూ.24 లక్షలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జోనల్ మేనేజర్ సీహెచ్‌వీ సుబ్రమణ్యం మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. అనంతరం కొరిటెపాడు శాఖ మేనేజర్ కె.బుల్లిబాబు, కమిటీ సభ్యులు కోట మాల్యాద్రిలు ప్రసంగించారు. ఈ సందర్భంగా గుంటూరు-1 టౌన్, కొరిటెపాడు శాఖల్లోని ఆరుగురు విద్యార్థులకు రూ.38 వేల విలువైన నగదు పురస్కారంతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో ఆతుకూరి కిరణ్ బాబు, పెన్నం అంజలి, కమ్మ రమ్య, గాజుల నాగసాయి లక్ష్మి హర్షిణి, వేజెండ్ల వసుధ, భాస్కరుణి సిరి ఉన్నారు. గుంటూరు-1 టౌన్ మేనేజర్ బి.కనకరావు అతిథులకు స్వాగతం పలుకగా కమిటీ సభ్యులు ఎస్.సత్యనారాయణ, జి.రాఘవేంద్రరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, బ్యాంకు సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

29న పుస్తకావిష్కరణ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బ్రాడీపేట లోని సీపీఎం కార్యాల యంలో ఈ నెల 29న సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మేము కూడా చరిత్ర నిర్మించాం'పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు స్థానిక బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో మాజీమంత్రి, ఎమ్మెల్సీ, వైసీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్ పుస్తకావిష్కరణ సభకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపా రాణి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్య క్షులు కొరివి వినయ్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు బందారు సురేష్‌బాబు, డాక్టర్ డీసీహెచ్ అంజయ్య, కవి బి.విల్సన్, మధుబాబు మున్నంగి, కడియం జేమ్స్ పాల్గొంటారని వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రముఖ సాహితీ విమర్శకులు సీహెచ్ సుశీలమ్మ, సీహెచ్.కోటేశ్వరమ్మ, బత్తుల అనిల్‌బాబు, కొమరాల రవికుమార్, తాటికొండ నరసింహారావు, కాపు శ్రీనివాస్, చల్లా మధుసూదనరావు, బందారు సురేష్ బాబు, గాయకులు జాన్‌బాబు, చంద్రపాల్ పాల్గొన్నారు.

వీణా లక్ష్మికి 'సంగీత కళానిధి' పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రఖ్యాత దర్శకులు కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా ప్రముఖ నిర్మాత రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన వాసవి ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమంలో కోడి రామకృష్ణ సంగీత కళానిధి పురస్కారం గుంటూరుకి చెందిన ప్రముఖ వీణా విద్వంసురాలు రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ అందుకున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ కార్యక్రమంలో అనేక మంది సినీ, టీవీ, సంగీత సాహిత్య కళాకారులకు ఈ పురస్కారాలను అందచేస్తున్నారు. ఈ అవార్డును ప్రముఖ సినీ నటులు సుమన్, బాబు మోహన్, కవిత, దివ్యవాని చేతుల మీదుగా అందుకోవడం తన అదృష్టమని లక్ష్మి శ్రీనివాస్ తెలిపారు. తనను ఈ అవార్డ్‌కి ఎంపిక చేసిన ప్రముఖ నిర్మాత రామ సత్యనారాయణకు వంశీ రామరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డ్ అందుకున్న లక్ష్మీని ఉభయ రాష్ట్రాలలోని కవులు, కళాకారులు అభినందించారు.

నేడు విద్యాసంస్థల బంద్

విశాలాంధ్ర-తాడేపల్లి: ఏపీలో విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. అధిక ఫీజుల నియంత్రణ, టీచర్ పోస్టుల భర్తీ, విద్యా, వసతి దీవెన డబ్బులు జమ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిలో భాగంగా సోమవారం టిఎన్ఎస్ఎఫ్ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు కంభం సాయి చంద్, గుంటూరు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి దర్శి హరి కృష్ణ, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి మాగంటి కళ్యాణ్, కార్యనిర్వాహక కార్యదర్శి తాడేపల్లి కిరణ్, కార్యదర్శి గోపి సభ్యులు విచారపు వంశీ, చెక్క సాయి తేజ, ఉదయ్, కళ్యాణ్ కుమార్, తాడేపల్లి పట్టణంలోని వివిధ ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కంభం సాయి చంద్ మాట్లాడుతూ మంగళవారం జరిగే బంద్ జయప్రదం చేయాలని కోరారు.

డాన్ బాస్కో కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు : విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న డాన్ బాస్కో కరస్పాండెంట్ గువ్వల బాలరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా స్పందన కార్యక్రమంలో డాన్ బాస్కో ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ గువ్వల బాలరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఆర్వో చంద్రశేఖర్‌కు విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బందెల నాసర్ జీ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఉన్న డాన్ బాస్కో ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ ఆ కళాశాలలో చదువుతున్న విద్యార్థులను మానసికంగా ఇబ్బందిపెడుతున్నారని అన్నారు. తాము చెప్పిన పనిచేయకపోతే మీకు హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులను బెదిరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులతో బాత్‌రూమ్‌లు కడిగిస్తున్నారని, విద్యార్థులను కులం పేరుతో దూషిస్తున్నట్లు నాసర్ జీ తెలిపారు. విద్యార్థులను ఖైదీలుగా భావిస్తూ వారిని మానసికంగా చిత్రహింసలు పెడుతున్నారని అన్నారు. తక్షణమే కరస్పాండెంట్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తెనాలి : కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదిన తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటర్‌మీడియెట్ విద్యార్థులతో కలిసి చిన్నారావూరు పార్కు వద్ద నుంచి బోస్ రోడ్డులోని టౌన్ చర్చి వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. పాశం వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తానన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి హామి ఇచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన నేటికి విద్యార్థులకు న్యాయం జరుగలేదని అన్నారు. తెనాలి నియోజకవర్గ కన్వీనర్ మద్దిలేటి కిరణ్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. బంద్ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి చెన్నూరు సాయి, సహాయ కార్యదర్శి తలపోటి శ్రీను, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, పట్టణ కార్యదర్శి బిళ్ల రాజేష్, నాయకులు కావేటి యశ్వంత్, శివ, సాయిప్రదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

న్యాయం జరిగేవరకూ సీపీఐ పోరాటం

విశాలాంధ్ర-వినుకొండ: బాయ్స్ హైస్కూలు సమస్యను పరిష్కరించి వెంటనే ఖాళీ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని రెండోసారి పల్నాడు జిల్లా కలెక్టర్‌ని కలిసి సీపీఐ పట్టణ సమితి కార్యదర్శి ఉలవలపూడి రాము వినతి పత్రం అందించారు. స్కూల్లో 30 మంది టీచర్లు ఉండాల్సి ఉండగా కేవలం 11 మంది మాత్రమే ఉండటంవల్ల ఈ స్కూలు ఉత్తీర్ణత శాతం 24 పర్సంటే అన్న విషయం అర్థం చేసుకోవాలన్నారు. ఈ స్కూల్లో ఇంగ్లీష్ చెప్పే టీచర్ కూడా లేరు వినుకొండలోనే ఉన్న జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో 45 మంది టీచర్లు ఉన్నారు మరి ఇక్కడ గత రెండు సంవత్సరాల నుండి 11 మంది టీచర్లు మాత్రమే ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని వెంటనే పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే ఖాళీ టీచరు పోస్టులను భర్తీ చేయకపోతే పిల్లల జీవితాలు పాడైపోతాయన్నారు. కలెక్టర్ స్పందిస్తూ విద్యాశాఖ అధికారులను పిలిచి చెప్పగా వారు వెంటనే వినుకొండ ఎంఈఓ తోటి మరి కొంతమంది అధికారులతో ఫోన్లో మాట్లాడడం జరిగింది. ఒకటి రెండు రోజుల్లోనే ఈ సమస్యనే పరిష్కరిస్తామని సాధ్యమైనంత మందిని టీచర్లని ఈ స్కూలుకు పంపుతామని జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారన్నారు. అలా కాకుండా మాట తప్పినచో ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందని రాము ఈ సందర్భంగా తెలిపారు.

అడవి పేరంటాలమ్మ దేవాలయంలో పూజలు

విశాలాంధ్ర-శావల్యాపురం: అధిక శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద మహిళలు ఆదివారం రాత్రి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి పాపరాజు పవన్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పొంగలి వండి అమ్మవారికి నైవేద్యం, పసుపు, కుంకుమలు, చీరె, సారెలను సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీ అడవి పేరంటాలమ్మ కోలాట బృందం వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కోలాట ప్రదర్శన నిర్వహించారు. కోలాటం మాస్టారు శ్రీకాంత్ ను బృందం సభ్యులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను బహుకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహించారు.

ఎల్ఐసీ ఏజెంట్లు ఐక్యంగా ముందుకు సాగాలి....

విశాలాంధ్ర-వినుకొండ: జీవిత బీమా సంస్థను కాపాడుకునేందుకు ఎల్ఐసి ఏజెంట్లు అందరూ కలిసి పనిచేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఏఓఐ)ఏజెంట్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రవి కిషోర్ పిలుపునిచ్చారు. ఎల్ఐసి ఏఓఐ వినుకొండ బ్రాంచ్ సర్వసభ్య సమావేశం సన్నిగంటి కోటేశ్వరరావు అధ్యక్షతన బ్రాంచి ఆవరణలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికిషోర్ మాట్లాడుతూ జీవిత బీమా పై పొంచి ఉన్న ప్రమాదాలను కాపాడుకునేందుకు, ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఏజెంట్లు ఐక్యంగా ఉండాలని అన్నారు. పాలసీదారుల ప్రయోజనం దృష్ట్యా జీఎస్టీని ఎత్తివేయాలని, ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రా ద్యూటీని పెంచాలని డిమాండ్ చేశారు. సంస్థను రక్షించండి, ఏజెంట్ల ను కాపాడండిఅన్న సంకల్పంతో పోరాటం చేస్తున్నది ఎల్ఐసి ఏఓఐ మాత్రమేనని చెప్పారు. సమావేశంలో టీ కోటేశ్వర రావు, మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు వై గాంధీ రామ్మోహన్ రావు, నరసరావుపేట బ్రాంచ్ అధ్యక్షులు నబీ బాజీ, బ్రాంచ్ నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, జ్వాలా నరసింహారావు, బ్రహ్మయ్య,చిన్న శీను పాల్గొన్నారు.

కత్తి వెంకటేశ్వర్లుకు సాహితీవేత్తల సన్మానం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం జనవిజ్ఞాన వేదిక, జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పి.వి.సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజిక సత్యాలను తన పద్యాలద్వారా తెలియజేసిన గొప్ప కవి జాషువా అన్నారు. ఎక్కుపెట్టిన సమాజాన్నీ ధిక్కరించిన కవి జాషువా అని ఆయన కొనియాడారు. ఇందులో భాగంగా ఇటీవల రాష్ట్ర అధికార బాషా సంఘ సభ్యులుగా ఎన్నికైన డా.కత్తి వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. తొలుత విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అతిథులు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దుల వెంకట కోటయ్య, గోరంట్ల నారాయణ, దారా కొండయ్య, చుక్కా విన్సెంట్ పాల్, దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి డి.వీర్రాజు,గార్డ్స్ సంస్థ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, సంస్థ సలహాదారులు మాజీ ఏజిపి దాసరి చిట్టిబాబు తదితరులున్నారు.

పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విశ్వకవి సామ్రాట్,. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 52వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయుడు. పోటు శ్రీనివాసరావు, .పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ యం సురేంద్ర రెడ్డి ఉపాధ్యాయులు ఏ నీలిమ విద్యార్థినీ విద్యార్థులు వారి చిత్ర పటానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
వెన్నపూస కాలనీ వాసులకు సిపిఐ. బూదాల

ఓటు హక్కు కల్పించాలని వినతి



విశాలాంధ్ర-వినుకొండ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 1వ వార్డు వెన్నపూస కాలనీలో సుమారు 100 కుటుంబాల వారికి ఓట్లు లేక పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తే వారు మీ ఇంటికి డోర్ నెంబర్ లేవు అన్న వంకతో వారికి ఓటు హక్కు కల్పించకుండా వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినుకొండ తహసీల్దార్ ఆఫీసులో డిప్యూటీ తహశీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లుకు స్పందనలో వినతిపత్రం అందజేశారు. మాకు డోర్ నెంబర్లు ఓటు హక్కును కల్పించాలని చెప్పి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఓటు హక్కు కల్పించాలని చెబుతున్నప్పటికీ నిర్లక్ష్యం చేయటం ఎంతవరకు సబబని హెచ్చరించారు. సిపిఐ నాయకులు కొప్పెరపు మల్లికార్జున, నల్లబోతుల శీను, తిరుమల శీను ,రమణయ్య, సాంబయ్య ,కోటేశ్వరరావు, బాచి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల కవి గుర్రం జాషువా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అభ్యుదయ కవి..ప్రజాకవి..తెలుగు ప్రజల కవి గుర్రం జాషువా అని కళాసౌధ, జిల్లా సాంస్కృతిక రంగ ప్రముఖుడు బి.వేదయ్య అన్నారు. పుట్టుకతో దళితుడై నవయుగ కవి చక్రవర్తి అయి తన కవితాయాత్ర విజయకేతనాన్ని తెలుగు సాహితీ గగనంలో ఉవ్వెత్తున ఎగరేసిన విశ్వ మానవుడు గుర్రం జాషువా అని అన్నారు. జాషువా 52వ వర్ధంతి సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో జాషువా వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తెలంగాణ తరహా సాగు సాయం అందించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: తెలంగాణా రాష్ట్రం లో రైతులకు ఇస్తున్నట్లుగా మన రాష్ట్రంలో రైతులకు పదివేలు సాగు సాయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏపి రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధానకార్యదర్శి వులవపూడి రాము ఆధ్వర్యంలో రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాను ఉద్దేశించి వులవపోడి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఏ విధంగా అయితే ఎకరాకు పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తుందో అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా రైతులకు సాగుకు సాగు సాయం ఎకరాకు పదివేల రూపాయలు రెండు ఎకరాల్లోపు 20 వేల రూపాయలు అందించాలని కోరారు. అదేవిధంగా కౌలు రైతులకు షరతులు లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి కూడా తెలంగాణ తరహాలో ఎకరాకు పదివేలు సాగు సహాయం చేయాలని, రెండు ఎకరాల లోపు ఉన్నవారికి 20 వేల రూపాయల సాగు సాయం అందించాలని అన్నారు. కేరళ తరహాలో రెండు లక్షల రూపాయల వరకు రైతుల రుణాలు అన్నిటిని మాఫీ చేయాలని. రైతులు పండించే అన్ని పంటలపై 50 శాతం బోనస్ ప్రకటించాలని 50 సంవత్సరాలు పైబడిన రైతులకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని. డాక్టర్ స్వామినాథన్ కమిషనర్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని రాము డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు పర్వతనేను లక్ష్మాధికారి, కొండలరావు, బొట్టు శీను, లింగం కోటిలింగం, చందు తదితర నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు కేంద్రానిదే బాధ్యత

విశాలాంధ్ర-నరసరావుపేట: మణిపూర్ మారణ హోమానికి నిరసనగా పల్నాడు జిల్లా నరసరావుపేటలో అఖిలభారత యువజన సమైక్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీని చేపట్టారు. మణిపూర్ మారణ హోమానికి నిరసన తెలుపుతూ మోడీ, అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్, షేక్ సుకో కన్వీనర్ బుదాల సాగర్ బాబు, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు చెరుకుపల్లి నిర్మల మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారమే ధ్యేయంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో మతకల్లోలాలు రేపుతూ వివిధ రాష్ట్రాలలోని వివిధ తెగల మధ్య విచ్ఛిన్న వైశాల్యాలను మతాలకు పులిమి ఒక మతానికి సంబంధించి ప్రజలపై దాడులకు తెగబడుతూ హతమార్చడం జరుగుతుందని ప్రజల మధ్య అంతర్యాలను తొలగించవలసిన హోం మంత్రి అమిత్ షా నోరు మెదపకపోవడం అమానుషమని అన్నారు. మణిపూర్‌లో ఇద్దరు స్త్రీలను బట్టలు లేకుండా ఊరేగింపు చేసిన ఘటన సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందని కనీసం ప్రధాని నరేంద్ర మోడీ ఆ చర్యలను ఖండించకపోవడం శోచనీయమని హోం మంత్రి అమిత్‌షా శాంతి భద్రతలను కాపాడటంలో పూర్తిగా వైఫల్యం చెందారని తక్షణమే రాజీనామా చేయాలని, మణిపూర్‌లో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బిజెపి కుట్రని దేశ ప్రజలు తెలుసుకొని రాబోయే రోజుల్లో ఈ దేశం నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మణిపూర్ ఘటనపై పార్లమెంట్లో ప్రతిపక్షాలు నిరసన తెలియజేసి అడుగుతుంటే నోరెత్తి మాట్లాడలేని ప్రధాని మోదీ, అమిత్ షాలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉన్న దేశంలో మహిళలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంటే దేశంలో మహిళా లోకం తలెత్తుకోలేక పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఏఐవైఎఫ్ నాయకులు పెరుపోగూ మార్క్, నీరుడి ఆనంద్,రూప్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పులిపాటి శశి, మహిళా సమాఖ్య నాయకులు యస్. దేవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: జగనన్నకు చెబుదాం.. (స్పందన) ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి వచ్చే ప్రజా ఫిర్యాదులను నిశితంగా పరిశీలన చేసి, అధికారులంతా సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నరసరావుపేట పట్టణంలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లోని డాక్టర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో సోమవారం కలెక్టర్ జగనన్నకు చెబుదాం.. స్పందన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 170 మంది అర్జీ దారులు కలెక్టరేట్ కు వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నపాలు చేసి వినతులను అందజేశారు. ప్రజా వినతులను జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంలు స్వీకరించి సమస్యల ఆధారంగా సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వాటిని అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

రైతులకు సన్మానం

పల్నాడు జిల్లాలో రైతుకు వందనం కార్యక్రమంలో బాగంగా వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ విభాగాలలో ఉత్తమ వ్యవసాయ పద్ధతులను అనుసరించి వ్యవసాయంలో నైపుణ్యం సాధించిన పలువురు రైతులను జిల్లా కలెక్టర్ శివశంకర్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి, ఆదర్శ రైతు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.జే బెన్నీ, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రవ్యాప్తంగా కె.జి. నుండి పి.జి. వరకు విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల కారణంగా విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోతున్నది. ఈ క్రమంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాపితంగా జులై 25న "విద్యాసంస్థల బంద్" కు విద్యార్థి సంఘాలు పిలుపునివ్వడం జరిగింది. ఈ బందు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం వారు సహకరించి, జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి బూదాల సాగర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా సుబ్బరామయ్య

విశాలాంధ్ర-నూజెండ్ల: స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా కంచర్ల సుబ్బరామయ్య నియమితులయ్యారు. సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్‌గా సుబ్బరామయ్య 2014-2018 వరకు మండలంలో పనిచేశారు. 2018లో సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్లను అప్పటి ప్రభుత్వం తొలగించింది. వీరిని స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. వీరభద్రాచారి నుంచి నియామక పత్రాన్ని అందుకుని బాధ్యతలు స్వీకరించారు.

గుర్రం జాషువాకు సీపీఐ ఘన నివాళి

విశాలాంధ్ర-వినుకొండ: కవి కోకిల కీర్తిశేషులు గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా సీపీఐ అధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ వినుకొండ నియోజకవర్గం కార్యదర్శి కామ్రేడ్ బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ: "జాషువా రచించిన కవితలతో ప్రజలను చైతన్యవంతులు చేసి అంటరానితనం నిర్మూలన చేయటంలో ప్రజలను చైతన్యవంతులు చేశారని, వారి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొప్పరపు మల్లికార్జున, నల్లబోతుల శ్రీనివాసరావు, తిరుమల శ్రీను, రమణ, ఆనంద్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో..... పట్టణంలోని జాషువా కళాప్రాంగణం నందు గల గుర్రం జాషువా విగ్రహానికి వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్రం జాషువా మన వినుకొండ ప్రాంతంలో జన్మించడం మన అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కేన మల్లికార్జున రావు, మున్సిపల్ చైర్మన్ డా.దస్తగిరి షకీలా, వై.సి.పి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్వర్యంలో: మహాకవి, కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమాన్ని జాషువా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక జాషువా కళా ప్రాంగణంలో ప్రారంభించినట్లు సంస్థ అధ్యక్షుడు మందా వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, జాషువా సాంస్కృతిక సమాఖ్య సభ్యులు , జీవనజ్యోతి స్వచ్ఛంద సంస్థ సభ్యులు గుర్రం జాషువా అభిమానులు పాల్గొన్నారు.

పాము కాటుకు రైతు మృతి

విశాలాంధ్ర-ఈపూరు: పాము కాటుకు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కొచ్చర్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తన్నీరు శివయ్య తన పొలంలో దోస తోట వేశాడని దోసకాయలు కోస్తుండగా పాము కాటు గురయ్యాడని తెలిపారు. శివయ్య(50)ను ప్రథమ చికిత్స నిమిత్తం కొచ్చర్ల గ్రామంలోని ప్రాథమిక వైద్యశాలకు తరలించగా నోటి వెంట నురుగు కక్కుకొని మృతి చెందాడన్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు కలరు. సదరు విషయమై ఈపూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గుర్రం జాషువా

విశాలాంధ్ర-అమరావతి : సమకాలిన సమాజం కోసం నిమ్న జాతి వర్గ కుల, మత, వర్గ లింగ వివక్ష విధానాన్ని వ్యతిరేకిస్తూ గాంధీ అడుగుజాడల్లో నడుస్తూనే అంబేద్కర్ ఆశయ స్ఫూర్తికి దగ్గరగా ఉండే కవిత్వ ఆలోచన విధానంతో వైతాళిక కవి రారాజుగా ప్రజల హృదయాలలో స్థిరత్వాన్ని పదిలపరుచుకున్న సువర్ణ రత్న మాణిక్యమైన గుర్రం జాషువా భౌతికంగ మన మధ్య లేకపోయినా ఆయన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పిన మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన అమరావతిలోని ప్రజానాట్యమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కవి కోకిలగా ప్రజలకు చైతన్యాన్ని కల్పించడంలో ఆయన చేతి నుంచి జాలు వ్రాలిన గబ్బిలం వెన్నెల తుఫాన్ నాలుగు పడగల హైందవ నాగరాజులు గజగజ వనికె ఆయన కవిత్వం సమకాలిన సామాజిక చైతన్యానికి ఊపిరిగా నిలవటంలో ప్రధాన భూమికను సంతరించుకుందని అన్నారు. ప్రజాప్రతినిధిగా దళిత వాదిగ రూపంతరం చెందాడన్నారు. ఆయన ఆలోచన భీష్ముడు వలె, కౌరవుల అధికారాన్ని అంగీకరిస్తూనే పరోక్షంగా పాండవుల విజయాన్ని కాంక్షిస్తున్నట్లు ఉండేదన్నారు. ఆయన రచనలు అంటరాని గబ్బిలాలు ఎన్నో నేటికీ సత్యహరిశ్చంద్ర నాటకం పేరు వింటేనే కవి విశ్వ విరాట్ జాషు గుర్తుకొస్తారన్నారు. అలాంటి మహోన్న చరిత్ర కలిగినటువంటి వ్యక్తిని కొల్పోవటం బాధాకరమని అన్నారు. నివాళులర్పించిన వారిలో జి.రాజు, చిక్కాల ఉదయ శేఖర్, బి.నారాయణ, శాంసోన్, ఎం.శ్రీనివాసరావు, కోటయ్య తదితర కళాకారులు పాల్గొన్నారు.

మంత్రి రజినికి తెలిసింది దోచుకోవడం... దాచుకోవడమే : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: చిలకలూరిపేటను మంత్రి రజిని, ఆమె కుటుంబీకులు లూటీ చేశారని.. ఆదాయ మార్గాలపై తప్ప ఓట్లేసిన ప్రజలపై ఇసుమంత శ్రద్ధ కూడా లేదని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. సోమవారం చిలకలూరిపేట మండలం పసుమర్రులో రక్షిత మంచినీటి సరఫరా పథకం, షాదీఖానా పనులపై సెల్ఫీ దిగి మంత్రి రజినికి సవాలు విసిరారు. దాదాపు 90 శాతం పూర్తయిన తాగునీటి పథకాన్ని కూడా అందుబాటులోకి తీసుకురాలేని దుస్థితిలో మంత్రి రజిని ఉన్నారని ఎద్దేవా చేశారు. పసుమర్రులో రక్షిత మంచినీటి సరఫరా పథకం పునరుద్ధరణ కోసం టీడీపీ హయాంలో రూ.6 కోట్ల నాబార్డు నిధులతో పనులు ప్రారంభించామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి 4.3 ఏళ్లయినా పూర్తి చేయలేకపోయిందని అన్నారు. 12 వేలమంది జనాభాకు ఉపయోగపడే తాగునీటి పథకాన్ని కూడా అందుబాటులోకి తీసుకురాలేని మంత్రి రజిని సిగ్గుపడాలన్నారు. మంత్రి రజినికి తెలిసింది దోచుకోవడం.. దాచుకోవడమేనని.. గుత్తేదారు కమీషన్ ఇవ్వలేదనే పనులు పూర్తి చేయడం లేదన్నారు. ఆస్తులు కూడబెట్టుకోవడంపై ఉన్న శ్రద్ధ ఓట్లేసిన ప్రజలపై లేదని.. 10 శాతం శ్రద్ధ పెట్టినా 5 శాతం పనులు పూర్తయ్యేవని ప్రత్తిపాటి అన్నారు. మొన్నటి వరకు ఆర్వో ప్లాంట్‌ను కూడా నిరూపయోగంగా ఉంచి హడావుడిగా అందుబాటులోకి తెచ్చారన్నారు. పసుమర్రులో రెండు ఎత్తిపోతల పథకాలను పాడుబెట్టారని.. రైతులపై కక్షతోనే ఎత్తిపోతల పథకాలను మూలనపడేశారా? అని ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందివ్వలేనప్పుడు, మరమ్మతులు చేపట్టలేనప్పుడు కమిటీలను ఎందుకు మార్చారని ప్రశ్నించారు. పసుమర్రులో రెండు ఎత్తిపోతల పథకాలను పాడుబెట్టి రైతులకు తీవ్ర నష్టం కలిగించారని ఆరోపించారు. చిలకలూరిపేటలో బార్లన్నీ మంత్రి రజిని కుటుంబం ఆధీనంలోనే ఉన్నాయని.. వారి ఆదాయం పెంచుకోవడానికి దుర్మార్గంగా పట్టణంలో ఉన్న మద్యం దుకాణాన్ని పసుమర్రుకు తరలించారని అన్నారు. కనీస ఇంకితజ్ఞానం లేకుండా డిగ్రీ కళాశాల, ఉన్నత పాఠశాల, 500 మంది మహిళలు పనిచేస్తున్న కంపెనీ, ముస్లింలకు పవిత్రమైన ఈద్గా వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేశారని అన్నారు.

పురుగుమందు తాగి సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అవినాష్ మండల కేంద్రమైన ఈపూరు ఎంపీడీవో కార్యాలయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఇటీవల అవినాష్ ఇనిమెళ్ళ సచివాలయం నుండి చిలకలూరిపేట మండలం మానికొండవారిపాలెంకు బదిలీ అయ్యాడు. దీంతో ఈ నెల15వ తేదీన బదిలీ ఆర్డర్స్ తీసుకొని ఈపూరు ఎంపీడీవో దగ్గర రిలీవింగ్ ఆర్డర్స్ కొరకు రాగా ఎంపీడీఓ సమ్మతించలేదు. వారం రోజుల నుండి రిలీవింగ్ ఆర్డర్స్ కొరకు ఎంపీడీవో చుట్టూ తిరుగుతున్నా ఎంతకు స్పందించక పోవడంతో మనస్తాపం చెందిన అవినాష్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వెల్ఫేర్ అసిస్టెంట్‌ను చికిత్స నిమిత్తం ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సదరు విషయమై ఎంపీడీవో రంగనాయకులును వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ ఇనిమెళ్ళ గ్రామసచివాలయంలో సిబ్బంది కొరత ఉండడంతో రెండు మూడు రోజులలో కాపు నేస్తం, వాహన మిత్ర పథకానికి సంబంధించి లబ్ధిదారులకు నగదు బదిలీ అయిన వెంటనే రిలీవ్ చేస్తానన్నారు. ఇంతలోనే అవినాష్ ఈ పని చేశాడని అన్నారు. అయితే అతనికి ఆరోగ్యం సమస్యలు ఉన్నాయని అందుకు సంబంధించిన హోమియోపతి పొడిని తీసుకొని తప్పు దోవ పట్టించాడని అవినాష్‌ను ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చెప్పినట్టు తెలిపారు. ఆయనకు ఎటువంటి ప్రాణాపాయం లేదని చెప్పారు. బదిలీల విషయమై ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పకుండా పాటిస్తామన్నారు.

మణిపూర్ ఘటనపై మోదీ మౌనమెందుకు

విశాలాంధ్ర-గురజాల: మణిపూర్‌లో జరిగిన రాక్షసఖాండను భారత కమ్యూనిస్టు పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబెద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తుందని, మోదీ పాలనలో దేశంలో ఏ ఒక్క వర్గానికి చెందిన ప్రజలు సంతోషంగా లేరని ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న మోడీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ఇంటికి వెళ్లడం ఖాయం అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారమే ధ్యేయంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో మతకల్లోలాలు రేపుతూ వివిధ రాష్ట్రాలలోని వివిధ తెగల మధ్య విచ్ఛిన్న వైష్యమ్యాలను మతాలకు పులిమి ఒక మతానికి సంబంధించి ప్రజ లపై దాడులకు తెగబడుతూ హతమార్చడం జరుగుతుందన్నారు. మణిపూర్ లో స్త్రీలను బట్టలు లేకుండా ఊరేగింపు చేసి మానభంగం చేసిన ఘటన యావత్ భారతదేశం సిగ్గుపడేలా ఉందని, కనీసం ప్రధాని నరేంద్ర మోదీ ఆ చర్యలను ఖండించకపోవడం బాధాకరం అని అన్నారు. మణిపూర్‌లో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బీజేపీ కుట్రని దేశ ప్రజలు తెలుసు కొని రాబోయే రోజుల్లో దేశం నుంచి బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

శాంతియుత నిరసన తెలిపే హక్కు లేదా...

విశాలాంధ్ర-గురజాల: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృష్ణాయపాలెం పర్యటనలో శాంతియుతంగా నిరసనకు జనసేన పార్టీ పిలుపునిస్తే పోలీసులను అడ్డంపెట్టుకుని జిల్లా వ్యాప్తంగా జనసేన నేతలకు 151నోటీసులు జరిచేసి నాయకులు ఎక్కడికక్కడా నిర్బంధించడం రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గ పాలనకు అద్దంపడుతుంది అని ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి కటికం అంకారావు అన్నారు. చలో కృష్ణాయపాలెం కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు తనకు 151నోటీసు ఇచ్చారు అని, గత నాలుగు రోజుల క్రితం గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా పిడుగురాళ్ల బైపాస్ విషయంలో ఎమ్మెల్యే 48గంటల్లో స్పష్టత ఇవ్వని నేపథ్యంలో నిరసన ప్రదర్శనలు చేస్తామని హెచ్చరించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన నేతలను, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేయడం పిరికిపంద చర్య అని ఆయన అన్నారు.

మణిపూర్ హింసపై నిరసన

విశాలాంధ్ర-రెంటచింతల: మణిపూర్ రాష్ట్రంలో 70 రోజుల నుంచి క్రైస్తవులు, మహిళలు, గిరిజనులు, చర్చిలపై జరుగుతున్న దాడులు, అమానవీయ, అమానుష హింసాత్మక చర్యలను నిరసిస్తూ, బాధితులకు బాసటగా మండల జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం రెంటచింతలలో క్రైస్తవులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి నుంచి రైల్వే స్టేషన్ రోడ్‌లోని తహసీల్దార్ కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీలో రాక్షస మూకల దాడులకు గురైన బాధితులకు సంఘీభావంగా నినాదాలు చేశారు. అనంతరం మణిపూర్‌లో తక్షణం శాంతి నెలకొల్పే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం మండల జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మామిడి ఐజాక్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన, జరుగుతున్న ఘటనలు దేశానికి మాయని మచ్చన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని హింసను అరికట్టడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చక్రపాణి, మోక్షానందం, బెంజిమన్, కృపానందం, పాల్ రాజ్, మాణిక్యరావు, జోసఫ్, ఆశీర్వాదం, సుశీల, ఆంథోని,పీటర్ పాల్, రాజేష్,మరియదాస్ తదితర సంఘ కాపరులు పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

విశాలాంధ్ర-రెంటచింతల: నర్సరీ నిర్మాణాలు అనేక మంది రైతులకు ఉపాధి మార్గాలుగా మారాయని దాంతో వారందరూ స్వయం ఉపాధి సాధిస్తున్నారని పల్నాడు జిల్లా ఉద్యాన శాఖాధికారి వై.మోహన్ తెలిపారు. సోమవారం ఆయన రెంటచింతల మండలంలోని వివిధ నర్సరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నర్సరీ యజమానులకు నోటీసులు అందజే శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా సాగు విధానంలో మార్పులు చోటు చేసుకున్న కారణంగా రైతులు నర్సరీలపైనే ఆధారపడుతున్నారన్నారు. దీన్ని గమనించి నర్సరీ నిర్వాహకులు నాణ్యమైన విత్తనాలు, మొక్కలు రైతులకు అందజేయాలని సూచించారు. నర్సరీ చట్టాన్ని అనుసరించి నిర్వాహకులు తదనగుణంగా వ్యవహరించాల్సి ఉంటుందని లైసెన్స్ లేని నర్సరీలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ,రైతులకు నాసిరకం నారు అందించిన ఎడల అటువంటి నర్సరీలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పరిశీలనలో ఆయన వెంట పవన్ కిశోర్, తిరుపతి నాయక్ తదితర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గోడౌన్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని మార్కాపురం రోడ్‌లో నూతనంగా నిర్మించిన సొసైటీ నూతన గోడౌన్ మరియు అగ్రిఅవుట్ లెట్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు వారితో పాటు నియోజకవర్గ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Court Notice
IN THE COURT OF THE HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE:: GUNTUR
O.S No: 1053/2022
Between:
Velpula Lakshmi Kumari -Plaintiff
And
Sankuri Ramesh Babu - Defendant
To.
Sankuri Ramesh Babu, S/o. Yesu,
Residing at Railway Quarters, Nadikudi, Dachepalli Mandal, Guntur Dist.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి ద్వారా దావా నోటీసులు /సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని **ది:28-07-2023** కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉ. గం.10-30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల అక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది: **28-07-2023**
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి,
వాది తరఫు అడ్వకేట్, గుంటూరు,
సెల్ : 94411 26993

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

అక్రమ కట్టడాలు నివారించాలి

విశాలాంధ్ర-అద్దంకి ; అద్దంకిలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలు, కొండపోరంబోకు భూములు, డొంక భూములను వదలకుండా యథేచ్ఛగా అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా రెవెన్యూ,మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా రెండు రోజుల నుంచి ఉత్తర అద్దంకి ఊరచెరువులో ఓ వ్యక్తి స్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. దామావారిపాలెం ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చినా వారు అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయడంలేదని చెబుతున్నారు. ఇప్పటికే వంద ఎకరాలు ఉన్న ఊరచెరువు ఎక్కువ భాగం ఆక్రమణదారులు ఆక్రమించి ఇళ్ళు నిర్మించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఊరచెరువు స్మశానవాటిక స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని నిలుపుదల చేయాలని వారు కోరుతున్నారు.

గుర్రం జాషువా వర్ధంతి

విశాలాంధ్ర-అద్దంకి ; నవయుగ కవి చక్రవర్తి పద్మ విభూషణ్ గ్రహీత గుర్రం జాషువా 52వ వర్ధంతి వేడుకలను సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ సింగంకొండ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పసుమర్తిపాలెంలో ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జాషువా తన ఖండ కావ్యములతో ఆనాటి సమాజంలో ఉన్న రుగ్మతలపై కొరడా ఝుళిపించిన మహెూన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ, కార్యదర్శి చప్పిడి వీరయ్య, రోటరీ సభ్యులు ఉబ్బా దేవపాలన, జాషువా కళా సాహిత్య వేదిక అధ్యక్షులు పీసీహెచ్ కోటయ్య, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మను పరామర్శించిన చైతన్య

విశాలాంధ్ర - బల్లికురవ : అంబడిపూడి గ్రామానికి చెందిన పల్లపు అంకమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం శాపు నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అంకమ్మ ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని అవసరమైతే తన సహాయ సహకారం అందిస్తానన్నారు. ఈయన వెంట బాపట్ల జిల్లా రైతు అధ్యక్షులు చింతల పేరయ్య షేక్ శ్రీనువలి, స్థానిక నాయకులు ఉన్నారు.

బైకు చోరీ

విశాలాంధ్ర - బల్లికురవ : మండల కేంద్రమైన బల్లికురవ ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైకు అపహరించుకు పోయిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే ఎస్సీ కాలనీ చెందిన కత్తి ఏడుకొండలు రోజువారిలాగే ఇంటి ముందు హెచ్ఎఫ్ డీలక్స్ ఏపీ27బిక్యూ 1081 నెంబర్ గల ద్విచక్ర వాహనం ఉంచాడు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంటి ముందు బైక్ లేకపోవడంతో చుట్టుపక్క వారిని విచారించగా ఎవరు చూడలేదన్నారు. ఎస్సీ కాలనీకి కూతవేటు దగ్గరలోనే ఉన్న పొగాకు గూడెమునకు బిగించిన సీసీ కెమెరాలు పరిశీలించగా రాత్రి ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బండి స్టార్ట్ చేసుకునేందుకు గూడెం సమీపంలో వైర్లు పీకేసి స్టార్ట్ చేసుకొని చెన్నుపల్లి వైపు తీసుకు వెళ్లినట్లు సీసీ పుటేజీలో గుర్తించారు. బైక్ చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఏడుకొండలు ఫిర్యాదు చేశాడు.

బాధితులకు సౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-పర్చూరు: హెచ్ఐవీ బాధితులు వైద్యుల సలహాలు తీసుకున్నట్లయితే దీర్ఘకాలం జీవించవచ్చునని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సౌమ్య శ్రీదేవి తెలిపారు. రోటరీ భవన్‌లో సోమవారం హెచ్ఐవీ సోకిన బాలబాలికలకు సౌష్టికాహారాన్ని అందించారు. ఆమె మాట్లాడుతూ బాధితులు తరుచూ వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవటానికి పౌష్టికాహారాన్ని తీసుకొని మందులు క్రమం తప్పకుండ వాడాలని సూచించారు. సమాజ సేవలో రోటరీ ముందంజంలో ఉన్నదని రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, ప్రతినిధులు కోటా శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, మున్నంగి వెంకటసుబ్బయ్య, దండా శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, వైద్యశాల సిబ్బంది షేక్ షంషేర్, ఎస్ అంజలి, బాధితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని నాగులపాలెంలోగల బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చేరుటకు అర్హత ఉన్నవారు ప్రత్యక్ష ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ పి.విశ్వరాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, విద్యార్థులు 10వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, తల్లిదండ్రుల సంవత్సరాదాయం రూ.లక్ష లోపు ఉండాలని ఆమె తెలిపారు. అర్హతలు ఉన్న విద్యార్థులు ఆయా గ్రూపులలో చేరుటకు ప్రత్యక్షంగా కళాశాల కార్యాలయంలో గాని లేదా 9704550091 సంప్రదించాలని ఆమె కోరారు.

కౌలు రైతులకు కార్డులు అందించాలి

విశాలాంధ్ర-పర్చూరు: కౌలు రైతులకు కార్డులు(సీసీఆర్సీ) అందించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం పర్చూరు సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాలలోని వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓ, ఏఈఓలకు ఖరీఫ్‌కి సంబంధించి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 60 నుండి 70 శాతం వరకు కౌలు రైతులు ఉన్నారని, భూమి యజమానులకు అవగాహన కలిగించి కార్డులు అందించాలని అన్నారు. ఈకేవైసీ ఈనెల 27లోపు చేయించుకోవాలని, ఆర్బీకేల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని, డివిజన్ పరిధిలో 11,969 కార్డులు అందేంచే లక్ష్యంగా పనిచేయాలని ఏడీఏ మోహనరావు తెలిపారు. సమావేశంలో ఏఓలు రామ్మోహనరెడ్డి, వేణుగోపాల్, సమరనాద్, సుధీర్‌బాబు, హెచ్ఓ రవి ప్రకాష్ ఉన్నారు.

టీడీపీ నాయకుడు నీలాంబరం మృతి

విశాలాంధ్ర-పర్చూరు: ఏదుబాబు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు రావూరి నీలాంబరం అనారోగ్యంతో మృతిచెందగా... టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తంచేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నీలాంబరం టీడీపీకి సేవలను గుర్తుచేసుకొని పార్టీకి తీరని లోటు అని ఏలూరి అన్నారు. టీడీపీ నాయకులు రావూరికి సంతాపం తెలిపారు.

బాపట్లలో గంజాయి ముఠా అరెస్టు

- 16 మందిపై కేసు నమోదు
- మీడియాతో ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్లలో గంజాయి మూలాలను ఎస్పీ వకుల్ జిందాల్ పెకిలించేస్తున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా క్షుణ్ణంగా పరిశీలిస్తు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతన్నారు. తాజాగా బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు వైజాగ్‌లో ఓ వ్యక్తి ద్వారా గంజాయి సేకరించి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో నిఘా పెట్టి గంజాయి ముఠాను బయటకు లాగిన్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్టూవర్టుపురం గ్రామానికి చెందిన భోగిరి ప్రదీప్ అతని స్నేహితుడు ప్రేమచండ్‌లు కలిసి వైజాగ్‌లోని దినేష్ అనే వ్యక్తి ద్వారా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్నారు. దినేష్ వైజాగ్ చెందిన గుంగోడు ద్వారా ఒడిస్సా నుండి గంజాయి తెప్పించటం జరుగుతుందన్నారు. ఒకరి ద్వారా ఒకరు గంజాయి సేకరించి తీసుకొచ్చి ఒంగోలు, స్టూవర్టుపురం, చీరాల పరిసరప్రాంతాలలో విక్రయిస్తున్నారన్నారు. ప్రదీప్, ప్రేమచండ్‌ల దగ్గర పాతనేరస్థుడు మోటా శ్రావణ్ అనే వ్యక్తి గంజాయి తీసుకొని తాఫీ కార్మీకులకు, కూలీలకు ఎక్కువ ధరకు విక్రయించి జల్సా చేస్తున్నాడని సమాచారం రావటంతో విచారణ చేపట్టగా తీగలాగితే డొంక కదిలినట్లు మొత్తం వెలుగులోకి వచ్చిందన్నారు. దీంతో వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల వద్ద నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న రూ. 25 లక్షల విలువైన 25కిలోల గంజాయి రూ. 10లక్షల విలువైన కారు. రూ. 20వేల నగదు, మొబైల్స్ స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి సిబ్బందితో కలిసి గంజాయి ముఠాను పట్టుకున్నారన్నారు. వారిలో భోగిరి ప్రదీప్, హరి ప్రేమ చంద్, మహ్మద్ అమీర్ బాషా, నల్లబోతుల చంద్రశేఖర్, శ్రావణకుమార్, శ్రీనివాసరావు, షేన్, సక్కా ఏసుబాబు, మిక్కిలి వంశీ, ఉప్పు సలోమను, కత్తుల చినవెంకటేశ్వర్లు, బొల్లాపల్లి జయపాల్,సాధిక్ షేక్ హుస్సేన్, దాసరి ఏసుబాబు, నాగం తరణ్, కొండ్రపాటి సాంబయ్యలు ఉన్నారన్నారు. వైజాగ్‌కు చెందిన దినేష్, గుండోడు పరారీలో న్నారని వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయించే వారితోపాటు సేవించే వారు కూడా నేరస్తులేనని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఇకపై సేవించే వారిని కూడా అరెస్ట్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 160 మందిపై సస్పెక్ట్ సీట్లు ఓపెన్ చేయటం జరిగిందన్నారు. నలుగురిపై పీడీయాక్ట్ అమలు చేశామని ఇంకా కొన్ని ప్రతిపాదనలలో ఉన్నాయని ఎస్పీ వివరించారు. గంజాయి కేసును చేదించిన సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్సై శ్రీను పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

జగనన్న సురక్షలో కర్లపాలెం పంచాయతీ స్టేట్ ఫస్ట్

సర్పంచ్‌ను అభినందించిన ఎమ్మెల్యే కోన

విశాలాంధ్ర - కర్లపాలెం జగనన్న సురక్ష కార్యక్రమంలో కర్లపాలెం పంచాయతీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని సాధించింది. మొత్తం 3940 గృహాలు ఉండగా సురక్ష కార్యక్రమంలో భాగంగా 10,262 సర్వీసులను అందజేశారు. ఇప్పటివరకు ఇదే రాష్ట్రంలో ప్రథమ స్థానం. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘుపతి పంచాయతీ సర్పంచ్ నక్క లలిత కుమారి, కార్యదర్శి మోదీ శ్రీనివాసరావు, డిజిటల్ అసిస్టెంట్ రత్నబాబు, వీఆర్వో రమేష్ రెడ్డి, సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష అనే ఒక కార్యక్రమాన్ని కర్లపాలెం పంచాయతీ సర్పంచ్ నక్క లలిత కుమారి ఒక ఛాలెంజ్‌గా తీసుకొని అద్భుతంగా పనిచేశారన్నారు. ఆ పనితీరుకు నిదర్శనమే ఈరోజు రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్క లలిత కుమారి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందిని, వీఆర్వోలను, వాలంటీర్లను, శాలువాలు పూలమాలతో ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం శాసనసభ్యులు కోన రఘుపతి గారు మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం కాళు అరిగేలా తిరిగే స్థాయి నుంచి మన ఇంటి వద్దకే సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ఏర్పాటు చేయటం ఎంతో గొప్ప విషయం అన్నారు. పేదవాడిగా ఆలోచిస్తే పేద వాళ్ళ బాధలు తెలిస్తాయి గాని, పెత్తందారుల లాగా ఆలోచిస్తే పేదవారి కష్టాలు తెలియవు అన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారామిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి, ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ కేశవ నారాయణ, ఈఓపిఆర్‌డి ఎలీషా బాబు, విద్యుత్ ఏ.ఈ. కుమార్, వ్యవసాయ, ఉపాధి హామీ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈలు, ఏపిఎం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తాజ్, పరమానంద కుమార్, పెద్ద శ్రీనివాస్ రెడ్డి, అమీర్ బేగ్, సర్పంచులు మల్లెల ఆదాం ఎంపిటిసిలు, లక్ష్మణ్ ఆసిఫ్ అలీ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - చీరాల : అభివృద్ధి పనులు వేగవంతం పూర్తి చేయాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాలు సత్వరమే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి అన్నారు.చీరాల మునిసిపాలిటీ మరియమ్మ పేట గ్రామసచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సచివాలయ పరిధిలో 1047 మందికి మంజూరయిన సర్టిఫికెట్లు అందజేసామని అన్నారు.తదనంతరం మరియమ్మపేటలో చేసిన అభివృద్ధి పనులైన రోడ్లు,డ్రైన్స్, ఎలక్ట్రికల్స్ స్తంభాలు,స్మశాన వాటిక వెనుక ఉన్న మురికి కాలువను పూడ్చడం,పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించారు. మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు,మునిసిపల్ డి ఈ ఐసయ్య,సల్లూరి అనిల్,వాసిమల్ల రత్నం,బొలపల్లి అనిల్,జంగా ప్రేమ్ కుమార్, మునిసిపల్ కౌన్సిలర్స్, వార్డు ఇంచార్జీలు,సచివాలయం కన్వీనర్లు,జెసిఎస్ మండల కన్వీనర్లు,వార్డు వాలంటీర్లు, గృహసారధులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని మేదరమెట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సంస్థ ఆధ్వర్యంలో ఏరియా కోఆర్డినేటర్ పులిపాటి వీరయ్య అధ్యక్షతన ఎస్సీ ఎస్టీ రైతులకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ రైతులు పంట సాగులో మెళుకువలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.నాణ్యమైన పంటలను అధిక దిగుబడులతో ఆర్థికంగా అభివృద్ధి చెంది మంచి ఆహారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే ప్రక్రియలో శ్రమిస్తున్న నిర్మాణాత్మక కృషికి దోహదపడే విధంగా పంట సాగు పద్ధతులపై మంచి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మండలములోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ సంబంధించిన అధికారులు మరియు కౌలు రైతులు పాల్గొన్నారు.

ఈపంట నమోదులో జియో ఫెన్సింగ్ తప్పనిసరి

విశాలాంధ్ర-అద్దంకి ; ఈపంట నమోదులో జియో ఫెన్సింగ్ తప్పనిసరి అని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె,ధనరాజ్ తెలిపారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అద్దంకి,కొరిశపాడు మండలాల వి.ఏ.ఏలు,విఆర్వోలకు ఈపంట నమోదుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి సర్వే నంబర్‌కి తప్పనిసరిగా వెళ్ళి ఫోటో తీయాలని,దీనితో ఈపంట నమోదులో ఖచ్చితత్వం వస్తుందని తెలిపారు.తహశీల్దార్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాస్తవ సాగుదారు పేరుపై ఈపంట నమోదు చేయాలని వారికి తప్పనిసరిగా కౌలు కార్డులు ఇవ్వాలన్నారు.వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతు కార్డుల ద్వారా రైతు భరోసా,ఇన్సూరెన్స్,గిట్టుబాటు ధరలు,పంట నష్టపరిహారం పొందవచ్చన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

విశాలాంధ్ర - యద్దనపూడి: పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పోలూరు గ్రామంలో చోటు చేసుకుంది.యద్దనపూడి ఎస్సై అనూక్ తెలిపిన వివరాల ప్రకారం పోలూరు గ్రామానికి చెందిన పోలూరి బుల్లెమ్మ (50) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉన్నందున, రెండు రోజుల క్రితం పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొగా,కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. చికిత్స పొందుతూ చనిపోయిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలకు జగనన్న సురక్ష సేవలు

విశాలాంధ్ర-రేపల్లె : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే సేవలు అందించటం జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ తునుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్తా అన్నారు. పట్టణంలోని నేతాజీ నగర్లో సోమవారం జగనన్న సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులకు అడంగల్, 1 బి, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, కులం, ఆదాయం, ఆధార్ సేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కట్టా మంగా, కమీషనర్ విజయ సారధి, కౌన్సిలర్ బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు ఓ వరం

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు జగనన్న సురక్ష ప్రజలకు ఓ వరమని శాపు నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు.సోమవారం మండల పరిధిలోని మల్లాయపాలెం వేమవరం గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని పలువురికి రేషన్ కార్డులు,కౌలు రైతు కార్డులు,కుల ధ్రువీకరణ తదితర ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య, తాసిల్దార్ రవిబాబు,ఎంపీడీవో సిహెచ్ కృష్ణ,పంచాయతీరాజ్ ఏఈ హనుమంతరావు,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలి : సీపీఐ

విశాలాంధ్ర-రేపల్లె : టిడ్కో గృహాల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని టిడ్కో గృహాల సాధన కమిటీ నాయకులు పి. నాగాంజనేయులు, గొట్టుముక్కల బాలాజీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలో గత 5 సంవత్సరాలుగా నిలిచిపోయిన టిడ్కో గృహాల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు గృహాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ టిడ్కో గృహాల సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు, బాలాజీలు మాట్లాడుతూ సొంత ఇంటి కల నెరవేరుతుందన్న ఆశతో టిడ్కో గృహాల కోసం అప్పులు చేసి వేలాది రూపాయలను డీడీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించితే ఇల్లు రాకపోగా చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడంతో లబ్ధిదారులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం జోక్యం చేసుకొని టిడ్కో గృహాల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని లేకుంటే రానున్న రోజుల్లో దశల వారి ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. సాధన కమిటీ నాయకులు దాసరి సాంబశివరావు, కె. వెంకట సుబ్బారావు, కొడాలి సాంబశివరావు, శ్రీరావమ్మ, ముసలయ్య, చంద్రశేఖర్, డి. ప్రకాశరావు, తలశిల సత్యనారాయణ, ఎం. కోటేశ్వరి, విజయ, బొలిశెట్టి సత్యనారాయణ, వసంత తదితరులు పాల్గొన్నారు.

నివేశన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని వినతి

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఏల్చూరులోని ఎస్సీ కాలనీకి చెందిన నిరుపేదలకు వారి పూర్వికుల నుంచి సంక్రమించిన నివేశన స్థలాన్ని అదే గ్రామంలోని కొందరు అక్రమార్కులు ఆక్రమణలకు పాల్పడటం అన్యాయమని సీపీఐ సంతమాగులూరు మండల సమితి సహాయ కార్యదర్శి కాలేషాగారి ఖాదర్ బాషా ఖండించారు. సోమవారం జరిగిన మండల కార్యాలయంలో జరిగిన స్పందనలో బాధితులతో కలిసి ఆయన తహసీల్దార్ టి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ.. ఏల్చూరు ఎస్సీ కాలనీలో ఉంటున్న పేదలకు వారి తాత, ముత్తాతల నుంచి వచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే వారి నివాసానికి సమీపంలో ఉన్న చెరువు నీరు, వర్షాకాలంలో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బందులకు గురైనట్లు చెప్పారు. ఈ కారణంగా ఆ ఇంటిని ఖాళీ చేసి, అదే కాలనీలో కారుమంచి వెళ్లే మార్గంలోని ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఇదే అదునుగా భావించిన భూకబ్జాదారులు ఖాళీగా ఉన్న నివేశన స్థలంపై కన్నేసి, ఆక్రమణలకు బరితెగించారని ధ్వజమెత్తారు. ఇదేమిటని అడిగిన స్థల యజమానిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని ఆయన తహసీల్దార్ ను కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నేతలు చింతలయ్య, కొండయ్య, నాగమ్మ, కరిముల్లా పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల నియోజక వర్గ తెదేపా ఇంఛార్జి ఎంఎం కొండయ్య ఆదేశాలను అనుసరించి నియోజక వర్గంలోని పాపాయి పాలెంలో తెదేపా మహిళా నాయకురాళ్లు మహా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు తెదేపా మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలను గురించి వివరించారు. ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, దీపం పథకం, ఉచిత ప్రయాణం పథకాల గురించి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రావణ మాసం కావడంతో దేవస్థానంలలోనూ, పూజా మందిరాలలోనూ ఉన్న మహిళలతో కలిసి తెదేపా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మనబోయిన రజని, సుబ్బలక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - వేమూరు : ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతన పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ తెలియజేశారు. సోమవారం వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించబడిన పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని , ఆయా పనులను అధికారులు త్వరగా పూర్తి చేయాలన్నారు. బుడా ఛైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు

మణిపూర్ మతోన్మాద ఘటన దేశానికి సిగ్గు చేటు

క్రైస్తవులు భారీ నిరసన ర్యాలీ

విశాలాంధ్ర - చీరాల : మణిపూర్ మతోన్మాద ఘటన దేశానికి సిగ్గు చేటని, మణిపూర్ లో జరుగుతున్న మతపరమైన దాడులను అరికట్టాలని,మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మత వ్యతిరేక విధానాలను ఆపి మణిపూర్ లో శాంతి స్థాపన కోసం కృషి చేయాలని పలువురు క్రైస్తవ సోదరులు అన్నారు.సోమవారం మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మత పరమైన దాడులను ఆపాలనిచీరాల పట్టణంలో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్ లు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీఅధికారంలోకి వచ్చిన తరువాత మతం పేరిట దాడులు పెరిగిపోయాయని అన్నారు.అందరిని భారతీయులుగా చూసే దృష్టి కోణాన్ని మరచి మను రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని అన్నారు.రెండు నెలలుగా మణిపూర్ లో యధేచ్చగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుంటే ప్రధాని నరేంద్రమోడీ కి మాత్రం చీమ కుట్టినట్లుగా కూడా లేదని,రాష్ట్ర ప్రభుత్వమే ఇటువంటి దాడులకు పాల్పడితే మణిపూర్ ప్రజలకు దిక్కెవరని అన్నారు.భారత రాజ్యాంగం కల్పించిన సమైక్య స్ఫూర్తిని దెబ్బతిస్తున్న ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు.స్వతంత్ర దేశంలో భారత స్త్రీలను బట్టలిప్పేసి ఊరేగించడమా మన అభివృద్ధి,ఇంతటి నీచ సంస్కృతి కి జీవం పోసింది ఎవరని ప్రపంచ దేశాల ముందు నగ్నంగా నడివీధుల్లో దేశాన్ని ఊరేగించారని అన్నారు.దేశ సైనికుల గుండెల్ని చీల్చి సైనిక శక్తులను హత మార్చారు.అన్నీ తెలిసి అయ్యో పాపం అంటూ మొసలి కన్నీరు కారుస్తూ చేసిన తప్పుల్ని కప్పి పుచ్చుకోవాలి అంటే ఇక కుదిరే పనికాదని,ఎప్పుడో రెండున్నర నెలలకు ముందు మొదలయిన మహిళల నగ్నదేహాల ఊరే గింపు ప్రదర్శన దాయాలి అనుకున్నా దాగలేదని అన్నారు.ఈ వికృత చర్యలకు పురుడుపోసిన శక్తుల అంతం ఇక ఆరంభం అయినట్లేనని సిగ్గు దాచుకోవడానికి ప్రాణాలు పణంగా పెట్టే భరత జాతి స్త్రీలను నడివీధిలో నగ్నంగా ఊరేగించి,మృగాలై మానభంగానికి తెగబడిన శక్తులపై దేశంలో 29 రాష్ట్రాలలో స్త్రీ జాతి పిడికిలి ఎత్తి పోరాడే రోజు వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ పాస్టర్లు,కుల మతాలకు అతీతంగా ప్రజలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మణిపూర్‌లో సైనికుడి భార్యతో పాటు మరో మహిళను వివస్త్ర చేసి ఊరేగించి హత్య చేయటం దారుణమని ఈ ఘటనకు పాల్పడిన నిందితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ, మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని లక్షల మంది స్వాతంత్ర్య సమర యోధులు తమ ప్రాణాలను త్యజించి బిన్నత్వంలో ఏకత్వం కలిగిన స్వతంత్ర భారత దేశంలో మహిళలపై దురాఘతంగా ప్రవర్తించటం సిగ్గుచేటన్నారు. కార్గిల్ యుద్ధంలో సైతం పాల్గొన్న సైనికుడి భార్యను హింసించటంపై తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఇలాంటి సిగ్గుమాలిన కౄరమైన సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రత్యేకమైన ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులను త్వరితగతిన శిక్షించినప్పుడే భాదితులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రెటరీ తోట దుర్గారావు, సయ్యద్ అఖిల్, చంద్ర మోహన్ మాజీ సైనికులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు కాంగ్రెస్ ఘన నివాళులు

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : గుర్రం జాషువా 52 వర్ధంతి పురస్కరించుకొని బాపట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు ఆధ్వర్యంలో జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ పట్టణంలో ఆయన పనిచేసిన స్కూల్ ముందే విగ్రహం ఏర్పాటు చేసిన గుర్రం జాషువా కమిటీని అభినందించారు. గుర్రం జాషువా తన కవిత్వంతో సామాజంలోని సామాజికతను రూపుమాపే విధంగా రచనలు చేసి రాజులను, బ్రాహ్మణులు మాత్రమే కీర్తిస్తూ ఊడిగం చేసినటువంటి తెలుగు సాహిత్యానికి దళిత యువకుడ్ని కథానాయకుడుగా ఆయన రచించిన మహాకావ్యం గబ్బిలం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దేవరాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు పఠాన్ రాజేష్, మండల అధ్యక్షులు శంకర్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కట్టా లాజరస్, చింతా బాబురావు, శీలం సాగర్,దోనపూడి రవి,సాధు హేర్బర్ట్, ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

దారిమళ్లుతున్న ఉపాధి కూలి బకాయిలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన వారి కూలి డబ్బును ఓ ఫీల్డ్ అసిస్టెంట్ దారిమళ్లిస్తూ జేబులు నింపుకుంటున్నారని సీపీఐ సంతమాగులూరు మండల సమితి సహాయ కార్యదర్శి కాలేషాగారి ఖాదర్ బాషా ఆరోపించారు. సోమవారం ఆయన నిజమైన ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీడీవో ఆఫీసులోని ఏవో మంగతాయారుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు రెండు నెలలుగా పెండింగులో ఉన్నాయని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా పని చేసిన వారి ఖాతాకు నగదు పడకపోగా, అసలు ఇటువైపు కన్నెత్తి చూడని వారి అకౌంటుకు నగదు జమ కావడం ఏమిటని ప్రశ్నించారు. ఆయా గ్రామాల్లోని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో గ్రూపునకు రూ.200 చొప్పున వసూలు చేసి మస్టర్లు వేస్తూ వారి ఖాతాలకు నగదు బదలాయింపు చేస్తున్నారని విమర్శించారు. ఈ కారణంగా నిజమైన కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వాస్తవాలను బట్టబయలు చేయడంతో పాటు అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కొండయ్య, వెంకటేశ్వర్లు, కరిముల్లా పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ క్యాన్లు బహుకరణ

విశాలాంధ్ర-వేటపాలెం : మండల కేంద్రమైన వేటపాలెంలో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో సోమవారం వేటపాలెం సెక్టార్ పరిధిలో గల 21 అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ క్యాన్లను రోటరీ క్లబ్ బహుకరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడిషనల్ సీడీసీవో ఎం.సుచిత్ర మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను గుర్తించి, వాటర్ క్యాన్లను బహుకరించడం అభినందనీయమని భవిష్యత్తులో మండల పరిధిలో గల అంగన్వాడి కేంద్రాలన్నిటికీ వాటర్ కాన్లు ఇవ్వాలని ఆమె కోరారు. రోటరీ సభ్యులు ఆర్.ఎం.పి. వైద్యులు కారంచేటి శివరామకృష్ణ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన చేపట్టారు. ఐ.సి.డి.ఎస్ .సూపర్వైజర్ సబ్బా పుష్పవల్లి, రోటరీ అధ్యక్షులు బట్ట మోహన్ రావు, కార్యదర్శిఏవి సురేష్, రోటరీ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి సీతా రాం, సభ్యులు డాక్టర్ దివి పవన్,ఖదీర్ భాష, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో మండలంలోని ఈపూరు పాలెం, పద్మనాభుని పేటలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, జామెంటరి బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు రోటరీ సభ్యుడు గుర్రం మోహనరావు అందించిన ఆర్థిక సహకారంతో పంపిణీ చేశారు. స్కూల్ లో వాలంటీర్‌గా పనిచేస్తున్న గుండపు కల్పనకు రూ.3 వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి రోటరీ క్లబ్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డి.వి.సురేష్, బి.హేమంత్ కుమార్, జి.వై.ప్రసాద్, హెడ్ మాస్టర్ కేశవస్వామి, వెంకటేశ్వర్లు, పద్మావతి, శోభారాణి, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన మున్నం వెంకటకృష్ణారెడ్డి (23) సోమవారం ఉదయం తన పొలంలో పనిచేస్తుండగా విద్యుత్తు స్థంబానికి ఉన్న ఆప్టికల్ ఫైబర్ కేబుల్ 11 కె.వి. స్తంభం మీద నుండి జారిపడి ఉండడం గమనించి ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను హైవోల్టేజ్ సరఫరా ఉన్న స్తంభానికి కట్టడానికి ప్రయత్నించే సమయంలో స్తంభంపై ఉన్న 11 కె.వి. వైర్లకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్ సపోర్ట్ తీగ తగిలి విద్యుత్ ఘాతానికి గురై మరణించారు. చిన్నపాటి నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీసిందని విద్యుత్ అధికారులు తెలిపారు. వయసుకు వచ్చిన ఇద్దరు పిల్లలు విద్యుత్తు ఘాతకానికి గురై రెండేళ్ల వ్యవధిలోనే చనిపోవడం తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.